క్లుప్తంగా

కేఆర్‌కేకు 'ఏ' గ్రేడ్ ప్రదానం

అద్దంకి: పట్టణంలోని శింగరకొండకు సమీపంలోని కట్టారామకోటేశ్వరరావు డిగ్రీ అండ్ పీజీ కళాశాలను మంగళవారం అడహక్ ఆడిట్ సభ్యులు సందర్శించారు. దానిలో భాగంగా కళాశాలలోని అన్ని విభాగాల రికార్డులను పరిశీలించారు. 2023–24, 2024–25 సంవత్సరాలకు 'ఏ' గ్రేడ్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వి. మోహనరావు సభ్యులను అభినందించి సన్మానం చేశారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

యద్దనపూడి: టైలరింగ్ శిక్షణ కోసం ఈ నెల 22 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యద్దనపూడి మండలానికి 86 ఉచిత కుట్టు మిషన్లు మంజూరైనట్లు తెలిపారు. బీసీ, ఓసీల్లో ఈడబ్ల్యూఎస్ మహిళలకు బీసీ కార్పొరేషన్ ద్వారా ఉచిత శిక్షణతో పాటు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తామన్నారు. అర్హులైన మహిళలు ఆయా గ్రామాల సచివాలయాల వద్ద, వెల్ఫేర్ అసిస్టెంట్ల వద్ద 22వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు 45 రోజుల నుంచి 90 రోజుల వరకు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ కాలంలో రూ.75 శాతం హాజరు కలిగి ఉండి టైలరింగ్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి ఉచిత కుట్టు మిషన్లు ప్రభుత్వం అందజేదిస్తుందని తెలిపారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

చీరాల అర్బన్: ఏపీ మోడల్ జూనియర్ కాలేజీలో 2025–26 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె.సరళ బుధవారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ఉచిత విద్యను పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులని, మే 25వ తేదీ వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో రుసుం చెల్లించవచ్చన్నారు. పదో తరగతి మార్కుల మెరిట్ ద్వారా రిజర్వేషన్ నియమాల ప్రకారం సీట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. బాలికలకు మాత్రమే హాస్టల్ వసతి ఉంటుందన్నారు.

పొదుపు గ్రూపులు అభివృద్ధి చెందాలి

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకునేలా కృషి చేయాలని ఐకేపీ పథకం ఏపీఎం మధుసూదనరావు సూచించారు. బుధవారం మండలంలోని బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో ఐకేపీ మండల సమాఖ్య ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధి పెంచేలా పొదుపు సంఘాల ఏపీఎంలు, అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వీవోఏలు పనితీరు మార్చుకుని చక్కగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ప్రతినిధులు, సీసీ, సీవీలు పాల్గొన్నారు.

రాతిముఖ మండప నిర్మాణానికి విరాళం



రాతి ముఖ మండపానికి విరాళాన్ని అందజేస్తున్న దాతలు

బల్లికురవ: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి రాతి ముఖ మండప నిర్మాణానికి మద్దిపాడు గ్రామానికి చెందిన యండ్రపాటి ఆనంద కుమార్, పద్మావతి దంపతులు రూ. 101,116 విరాళాన్ని బుధవారం దేవస్థాన అధికారికి అందజేశారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

23న శ్రీనివాస కల్యాణం

మార్టూరు: ఈనెల 23వ తేదీ తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జాతీయ రహదారి పక్కన గల శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయ కళ్యాణ మండపంలో తిరుమల దేవాలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు ఆధ్వర్యంలో నిర్వహించనున్న కళ్యాణ మహోత్సవానికి భక్తులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఎక్సైజ్ దాడుల్లో ఒకరు అరెస్ట్

చీరాల: చీరాల ఎక్సైజ్ అధికారులు బుధవారం చిన్నగంజాం మండలంలోని వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి అక్రమంగా మద్యం సీసాలు కలిగి ఉన్న ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారు. మండలంలోని కడవకుదురు బస్టాండ్ సెంటర్ వద్ద మున్నం రాంబాబు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి తొమ్మిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై బి.శ్రీహరి తెలిపారు.

నీరే ప్రాణం తీస్తే?



చెత్తాచెదారంతో ఉన్న తాగునీటి చెరువు

- కూలేందుకు సిద్ధంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్
- నీటిని పూర్తిగా నింపితే ఊగుతున్న వైనం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న చెరువుకట్ట

దగ్గుబాడు(కారంచేడు):

గ్రామాల్లోని పేదలకు శుద్ధ జలం అందించాల్సి అధికారులు శిథిలావస్థకు చేరుకున్న వాటర్ ట్యాంక్‌లతో తలలు పట్టుకుంటున్నారు. మండలంలోని దగ్గుబాడు గ్రామంలోని సుమారు 4000 మంది జనాభాకు తాగునీటి సరఫరా చేసేందుకు నిర్మాణమైన ఓవర్‌హెడ్ ట్యాంక్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. ఏ క్షణంలో కూలిపోతుందో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు అక్కడ చెట్లు ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు తెరతీస్తున్నారు. సమీపంలోనే ఉన్న మసీదు, ప్రధాన రహదారికి వెళ్లే రోడ్డు ఉండటంతో ఆ రోడ్డులో నడిచేందుకు కూడా ఆ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

35 సంవత్సరాల క్రితం నిర్మాణం

గ్రామంలోని చెరువు కట్ట మీద వైఎస్సార్ విగ్రహం సమీపంలో 35 సంవత్సరాల క్రితం 90 వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మాణం చేసిన వాటర్ ట్యాంక్‌కు మధ్యలో ఒకసారి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అప్పటి నుంచి ఇంత వరకు ఎలాంటి మరమ్మతులు చేయలేదు. సుమారు 10 సంవత్సరాల క్రితం నుంచి ట్యాంక్ అడుగు భాగంలో కొద్దిగా పెచ్చులూడి పడుతున్నాయి. ప్రమాదకరంగా ఉందని, వెంటనే దాని స్థానంలో నూతనంగా మరో ట్యాంక్ నిర్మాణం చేపట్టాల్సి ఉందని ప్రతిపాదనలు వెళ్తున్నాయి. ప్రస్తుతం వాటర్ ట్యాంక్ నాలుగు వైపులా ఉండే దిమ్మెలు పెచ్చులూడి, ఇనుప చువ్వలు సైతం బైటకు కనిపిస్తున్నాయి. ట్యాంక్‌కు పూర్తిగా నీటిని నింపాలంటే భయంగా ఉందని ఆపరేటర్ వాపోతున్నాడు. నీటిని పూర్తిగా నింపితే ట్యాంక్ ఊగిపోతుంటుందని గ్రామస్తులు చెబుతున్నారు.



పెచ్చులూడిపోయి కూలేందుకు సిద్ధంగా ఉన్న వాటర్ ట్యాంక్



చెరువు కట్టమీద పడేసి ఉన్న ఖాళీ సీసాలు

పని చేయని ఫిల్టర్ బెడ్‌లు

దశాబ్దాల క్రితం నిర్మాణం చేపట్టిన ఈ ఫిల్టర్ బెడ్‌లు ఫిల్టర్ చేయలేని దుస్థితిలో ఉంది. సాగర్ కాలువకు నీళ్లు వదిలినప్పుడు చెరువుకు నీళ్లు పంపింగ్ చేస్తారు. అవే నీటిని ఎలాంటి శుద్ధి లేకుండానే నీటిని ట్యాప్‌లకు విడుదల చేయాల్సి వస్తోంది. వాటర్ ట్యాంక్ నుంచి నీటిని సరఫరా చేసిన ప్రతి ఇంటికీ చేరాల్సిన నీరు పూర్తి స్థాయిలో చేరడం లేదనే ఆరోపణలు వినివిస్తున్నాయి. ఇంటి యజమానులు కూడా చిన్న మోటార్ల సాయంతో నీటిని పంపింగ్ చేసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని చెరువు కట్ట మీద ఉన్న రావి చెట్ల నీడలో అనేక మంది ఆకతాయిలు చేరుతుంటారు. మద్యం తాగడం, గుట్కాలు, పాన్‌పరాగ్‌లు, సిగిరెట్లు తాగడంతో పాటు, జూదం, బెట్టింగులు కూడా ఆడుతుంటారని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. బెట్టింగులతో అనేక మంది కుర్రకారు తమ జీవితాలను నాశనం చేసుకుంటూ అప్పుల పాలవుతున్నారు.



చెరువు వద్ద పనిచేయని ఫిల్టర్‌బెడ్‌లు

వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలి:

ఎంతో కాలంగా గ్రామస్తులకు నీటి సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంక్ శిథిలమవుతోంది. కొద్దిగా ట్యాంక్‌కు, ఫిల్లర్లకు ఉండే సిమెంట్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. ఎప్పుడు కూలిపడుతుందో అని ఆందోళనగా ఉంది. అయినా వాటిని పట్టించుకోవడం లేదు. ఫిల్టర్‌బెడ్‌లు పూర్తి నిరుపయోగంగా మారాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.



షేక్ సుభానీ, దగ్గుబాడు

అన్నింటికీ అడ్డాగా మారుతోంది:

గ్రామంలోని తాగునీట చెరువుకట్ట మీద అపరిశుభ్రత తాండవిస్తోంది. అక్కడ కుర్రకారు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి అని తేడా లేకుండా కాలక్షేపం చేస్తుంటారు.



షేక్ కాలేషా, దగ్గుబాడు

భూసార పరీక్షలు చేయించుకోండి



రైతులతో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి రామ్మోహన రెడ్డి



ఆదిపూడిలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ సుధీర్‌బాబు



జె.పంగులూరు: మాట్లాడుతున్న ఏఓ సుబ్బారెడ్డి

పర్చూరు(చినగంజాం): రైతులు భూసార పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్. రామ్మోహనరెడ్డి అన్నారు. మండలంలోని చింతకుంటపాలెం, పెద్దివారిపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఎస్. రామ్మోహనరెడ్డి ఆధ్వర్యంలో రైతులకు పంట నమోదు వలన కలిగే ప్రయోజనాలను గురించి వివరించారు. రైతులు తొలకరి వర్షాలు పడిన వెంటనే పచ్చి రొట్ట పైర్ల అయిన జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి వాటిని సాగు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు సబ్సిడీపై సరఫరా చేస్తామన్నారు. రైతులు తప్పనిసరిగా ప్రతి మూడు సంవత్సరాలకోసారి భూసార పరీక్షలు చేయించుకోవాలని దాని ఉపయోగాలను వివరించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా యంత్ర పరికరాలను 50 శాతం రాయితీపై సరఫరా చేయడం కోసం శ్రీకారం చుట్టిందని, పర్చూరు మండలానికి రూ. 12 లక్షలు వరకు వివిధ పరికరాలు సరఫరా చేయడం కోసం బడ్జెట్ కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది సీహెచ్ మధుమోహన్, నవీన్, రైతులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో లాభం

ఆదిపూడి (కారంచేడు): మండల పరిధిలోని రైతులు సాగుకు ముందుగానే పచ్చిరొట్ట సాగు చేసుకోవాలని వ్యవసాయాధికారి కె. సుధీర్‌బాబు తెలిపారు. బుధవారం ఆదిపూడి, ఎర్రంవారిపాలెం గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో రైతులకు సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట సాగు అనంతరం సాగుకు ముందు దానిని అక్కడే దున్నుకోవాలన్నారు. ప్రభుత్వాలు అందించే అనేక సంక్షేమ పథకాలను పొందేందుకు రైతులు తప్పకుండా యూనిక్ నంబర్లను వేయించుకోవాలన్నారు. వ్యవసాయ సహాయకులు శాంతి, రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

జె.పంగులూరు: రసాయన ఎరువులు అధికంగా వాడటం వల్ల భూసారం దెబ్బతింటుందని, రైతులకు పంట దిగుబడి తగ్గి, నష్టాలు చవిచూడాల్సి వస్తుంది ఏవో సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం నూజిళ్ళపల్లిలో మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రబీ కాలంలో పంట నమోదు చేయించుకొని ఉండి ఇంకా ఈ కేవైసి చేయించుకోని రైతులుంటే ఈ నెల 21వ తేదీ లోపు తప్పనిసరిగా చేయించుకోవాల్సిందిగా కోరారు.

రాములోరి కల్యాణానికి విగ్రహాలు సిద్ధం



సీతారాములు, లక్ష్మణుడు, హనుమంతుని విగ్రహాలు

చీరాల టౌన్: శ్రీరామనవమి సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లోని వాడల్లో చలువ పందిళ్లల్లో శ్రీరాముడు కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాములవారి కల్యాణానికి కావాల్సిన అందమైన ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను రాజస్థాన్ కళాకారులు సిద్ధం చేశారు. ఈపురుపాలెం, సాల్మన్‌సెంటర్, దేవాంగపురి గ్రామ పంచాయతీలతో పాటు 216 జాతీయ రహదారిలో కూడా రాజస్థానీ విగ్రహ తయారీదారులు వివిధ సైజుల్లో శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, హనుమంతుడు విగ్రహాలను తయారు చేసి అమ్మకాలు చేస్తున్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం ఫాల్గుణ మాసం అనూరాధ నక్షత్రం షష్టి తిథి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు బుధ వారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

నర్సరీలపై అవగాహన సదస్సు రేపు

మార్టూరు: బాపట్ల జిల్లాలోని నర్సరీల యజమానులకు ఈనెల 21వ తేదీ ఉదయం మార్టూరులో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా ఉద్యానవన శాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. స్థానిక జాతీయ రహదారి పక్కన రాజుపాలెం సెంటర్ లోని శ్రీ సాయి బాలాజీ కళ్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు సమావేశం ప్రారంభించనున్నట్లు తెలిపారు. నర్సరీల నిర్వహణలో రక్షిత వ్యవసాయ సాగు పద్ధతులు, శాస్త్రవేత్తలతో రైతులకు సలహాలు, ఉద్యానవన పంటల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించనున్నట్లు మార్టూరు ఉద్యానవన శాఖ అధికారి బి. హనుమంతు నాయక్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన షేక్ వలి

మార్టూరు: స్థానిక జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు గాయపడ్డాడు. యద్దనపూడి 108 సిబ్బంది వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం మద్దిరాల గ్రామానికి చెందిన షేక్ వలి టీవీఎస్ వాహనంపై మార్టూరు నుంచి సర్వీస్ రోడ్డులో స్వగ్రామం వెళ్తున్నాడు. స్థానిక ఎస్ఆర్ పెట్రోల్ బంక్ ఎదురుగా వాహనం అదుపు తప్పడంతో రోడ్డుపై పడ్డాడు. స్థానికుల సమాచారంతో యద్దనపూడి 108 సిబ్బంది చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


వైవీ కుటుంబ సభ్యులకు పరామర్శ

మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్లలోని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి నివాసంలో బుధవారం ఆయన మాతృమూర్తి యర్రం పిచ్చమ్మ చిన్న కర్మ కార్యక్రమం జరిగింది. వైవీ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అరకు శాసనసభ్యుడు ఆర్. మత్స్యలింగమ్, కౌన్సిల్ చైర్మన్ మోషన్‌రాజ్, మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, నందమూరి లక్ష్మీపార్వతి, చల్లా మధుసూదనరెడ్డి, రత్నాకర్, రమణారెడ్డి, వెంకటేశ్వరరావు తదితరులున్నారు.



పిచ్చమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నందమూరి లక్ష్మీపార్వతి , వైవీ సుబ్బారెడ్డి

వైభవోపేతంగా రామలింగేశ్వరుడి తిరునాళ్ల



అలంకరణలో రామలింగేశ్వరుడు

బల్లికురవ: ఉప్పుమాగులూరు సమీపంలోని గోటి కొండపై వేంచేసి ఉన్న రామలింగేశ్వర స్వామి వార్షిక తిరునాళ్ల బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచే శివునికి పంచామృతాలతో మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అన్నసంతర్పణ.. రాత్రికి భారీ ఎలక్ట్రిక్ ప్రభ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



స్వామివారి సన్నిధిలో ఎలక్ట్రిక్ ప్రభ

పోలీసులకు ట్రాఫిక్ కష్టాలు

బల్లికురవ: బల్లికురవ నాలుగు రోడ్ల కూడలిలో ఆక్రమణలతోపాటు రహదారులపైనే వాహనాలు నిలుపుదల చేయటంతో పోలీసులకూ ట్రాఫిక్ కష్టాలు తప్పటంలేదు. ఏఎస్ఐగా పనిచేస్తున్న బండి శ్రీనివాసరావు పదోన్నతి పొందటంతో బుధవారం రాత్రి వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ వెంకటరావు సంతమాగులూరు నుంచి వస్తూ నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. సైరన్ వేసుకుని ట్రాఫిక్‌లో మార్జిన్‌లో ద్వారా బయటకు వచ్చారు. ఉదయం, సాయంత్రం మార్టూరు వెళ్లే ప్రయివేటు పాఠశాల బస్సులు.. గ్రానైట్ లారీల రాకపోకలతో కూడలిలోని నాలుగు రోడ్లు రద్దీగా ఉంటోంది. ట్రాఫిక్ నియంత్రణకు ఓ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



ట్రాఫిక్‌లో చిక్కుకున్న సీఐ కారు

బినామీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోండి

బల్లికురవ: పనులకు వెళ్లినా క్రమమైన కూలీ నమోదు చేయకుండా బినామీ ఫీల్డ్ అసిస్టెంట్ ఇబ్బందులకు గురిచేస్తున్నాడంటూ రామాంజనేయపురం కూలీలు బుధవారం ఏపీఓ రమాదేవి ముందు వాపోయారు. ముక్తేశ్వరం పంచాయతీలో మూడు శివారు గ్రామాలున్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్ పోతురాజు స్థానంలో రామాంజనేయపురం గ్రామానికి ఓ బినామీని ఏర్పాటు చేశారు. పర్సంటేజీలకు అలవాటు పడిన ఇతను తనకు అనుకూలంగా ఉన్న కూలీలను అధికమొత్తంలో కూలి నమోదు చేస్తున్నాడని వివరించారు.



రామాంజనేయపురంలో ఏపీవోతో మాట్లాడుతున్న కూలీలు

గర్భిణులు వైద్యుల సూచనలు పాటించాలి

చీరాల టౌన్: గర్భిణులు విధిగా వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనల, సలహాలు పాటిస్తే ప్రసవాలు సాధారణంగా జరగడంతో పాటు తల్లీబిడ్డ ఆరోగ్యంగా జీవిస్తారని ఈపురుపాలెం పీహెచ్‌సీ వైద్యులు శ్రీదేవి సూచించారు. బుధవారం మండలంలోని ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రామంలోని గర్భిణులకు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలను చేశారు. గర్భిణులు 20 రోజులకు ఒకసారి విధిగా వైద్యుల వద్ద సేవలు పొందాలన్నారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడంతో పాటు పాలు, గుడ్లు, ఆకుకూరలు, బెల్లం విధిగా రోజువారీ ఆహారంలో ఉండాలన్నారు. రక్త హీనత రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆరోగ్యకేంద్రం సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలున్నారు.

అర్జీల విచారణ జాగ్రత్తగా చేయండి

చీరాల టౌన్: పలు ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చిన అర్జీలను జాగ్రత్తగా విచారించాలని డిప్యూటీ తహసీల్దార్ దేవతోటి అర్జున్ సూచించారు. బుధవారం వీఆర్వోలతో మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను త్వరగా విచారణలు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం అందించే రెవెన్యూ సేవలను అందరికీ అందించాలన్నారు. వీఆర్వోలు వారికి కేటాయించిన గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సేవలను అందించాలన్నారు. సమావేశంలో ఆర్ఐలు సత్యం, శేఖర్, వీఆర్వోలు తదితరులున్నారు.

పర్చూరు బార్ అసోసియేషన్ ఏకగ్రీవం

పర్చూరు(చినగంజాం): పర్చూరు కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా పి. జాన్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదరిశగా షేక్ రుక్సానా, సంయుక్త కార్యదర్శిగా కాసా అశోక్‌కుమార్, ట్రెజరర్‌గా కరి ప్రవీణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన కట్టా సాల్మన్ బుధవారం తెలిపారు.